# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :299 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 09-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## ట్రంప్ చర్యలతో స్వదేశంలోనూ వ్యతిరేకత

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఇతర దేశాలపై టారిఫ్‌లు, ఆంక్షలతో విరుచుకుపడుతున్న ఆయన స్వదేశంలోనూ కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద సహాయ సంస్థ అయిన 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ'లో ఏకంగా 9,700లకు పైగా ఉద్యోగాలు తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోంది. ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 10వేల మందికి పైగా ఉద్యోగులున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని చూస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా బ్యూరో, ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండనున్నారట..! మిగతా 9700 మందికి త్వరలోనే ఉద్వాసన పలకనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే, దీనిపై అమెరికా విదేశాంగ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని, వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## ఆమె వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవే.. బంగ్లాకు భారత్ గట్టి కౌంటర్



న్యూఢిల్లీ, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా చేసే వ్యాఖ్యలను భారత ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదని విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఆ దేశ హైకమిషనర్‌తో జరిపిన చర్చల్లో ఈ విషయాన్ని స్పష్టం చేశామన్నారు. ఇటీవల బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ చారిత్రక నివాసానికి పలువురు ఆందోళనకారులు నిప్పంటించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను షేక్ హసీనా ఖండిస్తూ అక్కడి తాత్కాలిక ప్రభుత్వంపై పలు వ్యాఖ్యలు చేశారు. వీటిని తీవ్రంగా పరిగణించిన ఆ దేశ అధికారులు.. ఢాకాలోని భారత తాత్కాలిక హైకమిషనర్‌కు సమన్లు జారీ చేశారు. ఈనేపథ్యంలోనే విదేశాంగ శాఖ తాజాగా స్పందించింది. 'బంగ్లాదేశ్‌తో సానుకూల, పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలను భారత్ కోరుకుంటుంది. ఈవిషయాన్ని ఇటీవల ఉన్నతస్థాయి సమావేశాల్లో పలుమార్లు పునరుద్ఘాటించాం. అయితే, ఆ దేశంలోని అంతర్గత పాలనా సమస్యలను గురించి అక్కడి అధికారులు చేసే ప్రకటనలు.. భారత్‌ను ప్రతికూలంగా చిత్రీకరించేలా ఉండటం గమనార్హం. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమైనవి. ఇందులో భారత్ ఎలాంటి పాత్ర పోషించదు. ఆమె వ్యాఖ్యలను భారత ప్రభుత్వానికి ఆపాదిస్తే.. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటాయి. దీన్ని బంగ్లా కోరుకోవడం లేదని విశ్వసిస్తున్నాం' అని జైశ్వాల్ తెలిపారు. ఈమేరకు బంగ్లా తాత్కాలిక హైకమిషనర్‌కు సమన్లు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని అవామీ లీగ్ పార్టీ నేతలకు షేక్ హసీనా పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలోనే ఆమె తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ చారిత్రక నివాసంపై కొందరు దుండగులు దాడి చేసి నిప్పంటించారు. ఈ ఘటనను హసీనా తీవ్రంగా ఖండించారు. 'నిరసనకారులు భవనాన్ని కూల్చివేయగలరు. కానీ, దాని చరిత్రను కాదు. చరిత్ర దాని ప్రతీకారం తీర్చుకుంటుంది. మీకు ఆ ఇల్లంటే ఎందుకు భయం?. దేశ ప్రజల నుంచి న్యాయం కోరుతున్నా. నేను మీకు ఏమీ చేయలేదా?' అని ఆమె వ్యాఖ్యానించారు. వీటిని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈనేపథ్యంలో ఢాకాలోని భారత తాత్కాలిక హైకమిషనర్‌ను పిలిపించి.. హసీనా ప్రకటనలపై తమ నిరసనను తెలియజేసింది. అక్కడ ఉండి ఆమె చేస్తున్న తప్పుడు ప్రకటనలను నిరోధించాలని భారత్‌ను రాతపూర్వకంగా అభ్యర్థించింది.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు ఈసీ సిద్ధం..

హైదరాబాద్,తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సిద్ధమవుతోంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిన ఈసీ, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ అందించడంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 15వ తేదీలోగా సంబంధిత సిబ్బందికి ఎన్నికల తీరుపై శిక్షణ పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొంది.రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైందని చెప్పవచ్చు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో తమ హవా కొనసాగించేందుకు ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించాయి. మొదటగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండడంతో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పార్టీలు సమాయత్తమయ్యాయి.ఈ దశలో ఓవైపు రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతుండగా, ఎన్నికల కమిషన్ కూడా అదే రీతిలో అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ఈనెల 10, 12, 15న పీవో, ఏపీవో లకు శిక్షణ ఇవ్వనుండగా పదవ తేదీలోగా ఎన్నికలకు సిబ్బందిని నియమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.అయితే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ఖరారంటూ సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ గా మారింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 10వ తేదీ విడుదల కాబోతుందని, 24న మొదటి విడత ఎన్నికలు, మార్చి మూడో తేదీన రెండో విడత ఎన్నికలు, మార్చి పదవ తేదీన మూడో విడత ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది.




అయితే ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ పై అధికారిక ప్రకటన చేయలేదు.ఇటీవల సీఎల్పీ సమావేశం నిర్వహించిన తెలంగాణ కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికలలో తమ హవా చాటుకునేందుకు నాయకులను సిద్ధం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో విజయాలను సాధించిందని, ఓవైపు రాష్ట్ర అభివృద్ధి తో పాటు, మన వైపు సంక్షేమ పథకాలను కూడా అమలు చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి ఆత్మహత్య..!

హైదరాబాద్,అమెరికాలో తెలుగు విద్యార్థుల బలవన్మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో కొందరు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం తెలంగాణకు చెందిన విద్యార్థి యూఎస్ లో అనుమానాస్పద రీతిలో మరణించాడు. ఆ విషాద ఘటన మరువక ముందే.. మరో తెలుగు విద్యార్థి అమెరికాలో ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది.

**చదువుకుంటూనే పార్ట్‌టైమ్ జాబ్..**

మృతుడిని తుమ్మేటి సాయికుమార్‌రెడ్డిగా గుర్తించారు. న్యూయార్క్‌లోని తన రూమ్‌లో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హయ్యర్ స్టడీస్ కోసమని సాయికుమార్ అమెరికా వెళ్లాడు. చదువుకుంటూనే పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సాయికుమార్ బలవన్మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది. సాయికుమార్ మృతితో అతడి ఇంట్లో తీవ్ర విషాదం అలుముకుంది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఫెడరల్ అధికారుల తనిఖీల్లో భాగంగా సాయికుమార్ పాస్‌పోర్ట్‌ను సీజ్ చేశారని, ఆందోళనకు గురైన అతడు ఇంటికి వెళ్లలేనేమోనన్న భయంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

**కారులో విద్యార్థి మృతదేహం..**

కొన్ని రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన బండి వంశీ(25) అనే విద్యార్థి అమెరికాలో అనుమానాస్పద రీతిలో చనిపోయాడు. వంశీ కాంకోర్డియా సెయింట్ పాల్ యూనివర్సిటీలో చదువుతున్నాడు. ఓ కారులో అతడి మృతదేహం కనిపించింది.



ట్రంప్ రాకతో దయనీయ పరిస్థితులు..

కాగా, యూఎస్ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ వచ్చాక.. అక్రమ వలసదారుల పట్ల తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. అమెరికాలో అక్రమంగా వలస ఉంటున్న వారికి సంకెళ్లు వేసి మరీ వారి వారి స్వదేశాలకు పంపించేస్తున్నారు. ట్రంప్ నిర్ణయాలతో అమెరికాలో తెలుగు విద్యార్థులకు కష్టాలు ప్రారంభమయ్యాయి.ఓవైపు చదువుకుంటూనే మరోవైపు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకునే వారి పరిస్థితి దయనీయంగా తయారైంది. పార్ట్ టైమ్ జాబ్స్ పోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ఎడ్యుకేషన్ కోసం తీసుకున్న లోన్లు చెల్లించేందుకు డబ్బులు లేక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతుండటం ఆందోళనకు గురిచేసే అంశం.

## సాయిరెడ్డి అంతా చెప్పేశారు.. జగన్ ఇక జీరో.. వైఎస్ షర్మిల



హైదరాబాద్, మాజీ సీఎం జగన్ పై ఆయన సోదరి ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ సంచలన కామెంట్స్ చేశారు. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి, షర్మిళతో భేటీ అయినట్లు వార్తలు హల్చల్ చేశాయి. అయితే ఈ భేటీపై ఇప్పటివరకు సాయి రెడ్డి ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో అందరూ వదంతులుగానే భావించారు. అవ్వదంతులకు తాజాగా షర్మిళ ఫుల్ స్టాప్ పెట్టారు. సాయి రెడ్డితో భేటీ జరిగిన మాట వాస్తవమేనని, అన్ని విషయాలను చర్చించడం జరిగిందంటూ షర్మిళ అన్నారు.ఇదే విషయంపై స్పందించిన షర్మిళ కంచలన కామెంట్స్ చేశారు. 2024 ఎన్నికల్లో జగన్ తన చేతులు తానే కాల్చుకున్నారని, ఇప్పుడు బీద ఏడుపులు ఏడుస్తూ ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. నమ్ముకున్న పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయలేని వైయస్ జగన్, ఇప్పుడు కార్యకర్తలను బ్రతిమలాడుకుంటూ ప్రకటనలు విడుదల చేస్తున్నారన్నారు. జగన్ క్యారెక్టర్ లేదంటూ, ప్రస్తుతం ఆయన క్యారెక్టర్ జీరో కు పడిపోయిందని షర్మిళ విమర్శించారు.సాయి రెడ్డితో జరిగిన భేటీలో చాలా విషయాలు చర్చకు వచ్చాయని, జగన్ వద్ద తాను పడ్డ ఇబ్బందులను తనతో చెప్పుకున్నారన్నారు. ఆస్తుల వ్యవహారంలో జగన్ ఇచ్చిన సూచన మేరకే, తాను స్పందించినట్లు సాయి రెడ్డి ఒప్పుకున్నారని జగన్ ఇంతలా దిగజారి పోవాలా అంటూ ప్రశ్నించారు. సాయి రెడ్డి రాజీనామా పై జగన్ ఇటీవల స్పందిస్తూ.. రాజకీయాలలో క్యారెక్టర్ అవసరం అంటూ చేసిన కామెంట్స్ పై షర్మిళ సీరియస్ కామెంట్ చేశారు.క్యారెక్టర్ లేని జగన్ క్యారెక్టర్ గురించి మాట్లాడుతున్నారని, క్యారెక్టర్ అనే పదం అర్థం కూడా జగన్ కు తెలియదన్నారు. వైయస్సార్ కుటుంబం పరువు తీయవద్దని సాయిరెడ్డి వేడుకున్నా, అబద్ధాలు చెప్పించిన ఘనత మాత్రం జగన్ కే దక్కుతుందన్నారు. సొంత తల్లి మీద స్వార్థం కోసం కేసు పెట్టడం, సొంత చెల్లికి వెన్నుపోటు పొడచడం ఇవే నా క్యారెక్టర్ అంటూ ఆమె ప్రశ్నించారు. సొంత చిన్నానను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డిని పక్కన పెట్టుకున్నప్పుడే.. జగన్ విశ్వసనీయత పోయిందని వైయస్ షర్మిళ అన్నారు.షర్మిళ చేసిన ఈ కామెంట్స్.. జగన్ కు భారీ షాకిచ్చాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడిప్పుడే పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు జగన్ అడుగులు వేస్తున్న క్రమంలో, షర్మిళ చేసిన కామెంట్స్ జగన్ కు ఎదురుదెబ్బ అంటూ ప్రచారం సాగుతోంది. మొత్తం మీద సాయి రెడ్డి రాజీనామా చేయడం, ఆ తర్వాత షర్మిళ తో భేటీ కావడం చూస్తుంటే.. మున్ముందు సాయి రెడ్డి నోట ఎటువంటి ఆరోపణలు వినిపిస్తాయోనని ప్రచారం ఊపందుకుంది. మరి షర్మిళ చేసిన కామెంట్స్ కి జగన్ రియాక్షన్ ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## హమ్మయ్యా...బెర్తులన్నీ సేఫ్..



హైదరాబాద్,తెలంగాణాలో త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆ వార్తలన్నింటిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్లు చల్లేశారు. ప్రస్తుతానికి మంత్రివర్గ విస్తరణ లేదని ఆయన శుక్రవారం తేల్చి చెప్పేశారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో వరుస భేటీలు నిర్వహించారు. అందులో భాగంగా ఆయన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్ ను కూడా కలిశారు. ఈ భేటీలో మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వచ్చింది.ఇప్పటికిప్పుడు మంత్రివర్గ విస్తరణ లేదన్న రేవంత్ రెడ్డి.. పీసీసీ పునర్వ్యవస్తీకరణ మాత్రం ఉంటుందని చెప్పారు. పీసీసీ షఫిలింగ్ త్వరలోనే ఉంటుందని ఇప్పటికే దానికి సంబందించిన కసరత్తు పూర్తి అయ్యిందని కూడా రేవంత్ చెప్పారు. పీసీసీ పునర్వ్యవస్తీకరణ, కేబినెట్ పునర్వ్యవస్తీకరణ ఒకే సమయంలో ఉంటే కాస్త ఇబ్బందిగానే ఉంటుందన్న భావనతో కేబినెట్ పునర్వ్యవస్తీకరణను వాయిదా వేసినట్టు సమాచారం.కేబినెట్ పునర్వ్యవస్తీకరణ వాయిదా పడటంతో ఆశావహులు నీరుగారిపోయినా.. కేబినెట్ నుంచి ఉద్వాసన తప్పదని భావించిన వారు మాత్రం ఊపిరి పీల్చుకున్నారని చెప్పక తప్పదు. రేవంత్ కేబినెట్ ఏర్పడి అప్పుడే ఏడాది దాటిపోయింది. ఈ ఏడాది కాలంలో పలువురు మంత్రులపై లెక్కలేనన్ని వివాదాలు వచ్చాయి. కొండా సురేఖ అయితే ఎప్పుడు కేబినెట్ పునర్వ్యవస్తీకరణ ఉన్నాఆమెపై వేటు ఖాయమన్న వాదనలు వినిపించాయి. అయితే ఇప్పుడు కేబినెట్ విస్తరణ వాయిదా పడటంతో సురేఖతో పాటు వేటు పడుతుందని భావిస్తున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

## మహాశివరాత్రికి శ్రీశైలం ముస్తాబు

హైదరాబాద్,మహాశివరాత్రికి శ్రీశైలం అవుతోంది. ప్రతీ ఏటా శివరాత్రి వేళ శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సైతం ఈ మేరకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. పెద్ద సంఖ్య లో భక్తులు తరలి వస్తారనే అంచనాలతో ఏర్పాట్ల పైన అధికారులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి మార్చి1 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇక, తెలంగాణ టూరిజం శ్రీశైలం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేస్తోంది. ఈ నెల 26న మహా శివరాత్రి. ప్రముఖ క్షేత్ర శ్రీశైలంలో ఈ నెల 19 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి తరలి రానున్నారు. దీంతో, భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక.. తెలంగాణ టూరిజం శాఖ తాజాగా శ్రీశైలం వంటి ప్రాంతాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. రెండు రోజుల పాటు సాగే యాత్ర కోసం పెద్దలకు రూ 2,999 తో, అదే విధంగా పెద్దలకు రూ 2,392 విలువ చేసే ప్యాకేజీలను వెల్లడించింది. శ్రీశైలం యాత్ర ప్రత్యేకంగా రెండు బస్సులను కేటాయించారు. వాటిలో ఒక ఏసీ బస్సు కూడా ఉంది. నాన్-ఏసీ బస్సు ప్యాకేజీ ధరలను ప్రకటించారు. నాన్ ఏసీలో పెద్దలకు రూ 2 వేలు, పిల్లలకు రూ 1,600 గా ఖరారు చేసారు. రెండు రోజులు వసతి సౌకర్యం కల్పించారు. ఉదయం 8:30 గంటలకు టూరిస్ట్ భవన్ నుండి ప్రారంభమవుతుంది. సాయంత్రం 5 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. టూర్ లో భాగంగా మధ్యలో సాక్షి గణపతి ఆలయాన్ని సందర్శించవచ్చు. వారిని నేరుగా హోటల్‌కు తీసుకెళ్తారు. శ్రీశైల దర్శనం రెండవ రోజు సాయంత్రం లేదా తెల్లవారుజామున చేసుకునే విధంగా ప్లాన్ చేసారు. రోప్‌వే (పాతాళ-గంగా), ఫలధార, పంచధార, శిఖర, చివరకు ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ఆనకట్టను సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం ఉంటుంది.



## మూసీ పునర్జీవంపై పార్లమెంట్‌లో ప్రస్తావన..

హైదరాబాద్ : మూసీనది పునర్జీవంపై రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. శుక్రవారం జీరో అవర్‌లో మాట్లాడిన అనీల్‌కుమార్ యాదవ్.. మూసీనదిని జాతీయ నదీ పునర్జీవం పథకంలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన ఆయన పార్లమెంట్‌లో మాట్లాడేందుకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మూసీ విశిష్టతను, పునర్జీవం ఆవశ్యకతలను వివరించే ప్రయత్నం చేశారు.మూసీనదికి గొప్ప చరిత్ర ఉందని, ఒకనాడు హైదరాబాద్ తాగునీటికి, వ్యవసాయానికి దోహదపడిన మూసీనది ప్రస్తుతం పూర్తిగా కలుషితమై మురుగు నాలాగా మారిందని తెలిపారు. హైదరాబాద్ నగర విస్తరణలో పలు కంపెనీల కాలుష్య వ్యర్థాలు, సీవరేజ్ వ్యర్థాలు మూసీలో కలుస్తున్నాయని, దీని పరివాహక ప్రాంతాల్లో జీవనోపాధి దెబ్బతిన్నదని వివరించారు. మూసీనదికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మూసీనది అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం తగిన నిధులిచ్చి సహకరించాలని డిమాండ్ చేశారు.



## ఆదాయానికి మించిన ఆస్తులు.. వరంగల్ డీటీసీ అరెస్ట్



వరంగల్:ఉమ్మడి వరంగల్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఇళ్లో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని గుర్తించి అరెస్టు చేశారు. హన్మకొండ పలివేల్పుల రహదారిలోని దుర్గాకాలనీలో ఉంటున్న శ్రీనివాస్ ఇంటికి ఉదయం 9గంటలకు చేరుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆదాయ పత్రాలు, దస్తావేజులు, స్థిర, చరాస్తులకు సంబంధించి విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్ స్వస్థలమైన జగిత్యాలతోపాటు హైదరాబాద్ లోని ఆయన నివాసంలోనూ ఏకకాలంలో సోదాలను నిర్వహించారు. సుమారు 10 గంటలపాటు ఆయనను విచారించారు. ఇంట్లోని పలు దస్తావేజులు పరిశీలించిన తర్వాత హసన్ పర్తి మండలం చింతగట్టు క్యాంపులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి తీసుకుని వచ్చి పలు అంశాలపై సమాచారాన్ని సేకరించారు.

## సైకో మారడమే జగన్ 2.0

అమరావతి, సైకో జగన్‌గా మారడమే జగన్ 2.0 అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి విమర్శించారు. శవం లేస్తే కానీ బయటకు రాని దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని ఆరోపించారు. వైఎస్ విజయలక్ష్మి, షర్మిల ఆయుష్షు గట్టిది కాబట్టే జగన్‌కు దూరంగా ఉంటున్నారని చెప్పారు. జగన్ తీరు మారకుంటే.. ప్రజలే జగన్‌ను ఏపీ నుంచి బయటకు గెంటుతారని అన్నారు. ప్రజలు తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టిడించే పరిస్థితిని.. జగన్‌రెడ్డి తెచ్చుకోవద్దని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హెచ్చరించారు. ఆత్మలతో మాట్లాడే జగన్ మానసిక పరిస్థితి అందరికీ తెలిసిందేనని విమర్శించారు. లండన్‌లో తెచ్చుకున్న మందులు పని చేయట్లేదని జగన్ మానసిక పరిస్థితి చూస్తే అర్థమవుతోందని అన్నారు. జగన్ మానసిక పరిస్థితికి జాలిపడి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యానికి తాను సిఫార్సు చేస్తానని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ సాయంతోనైనా జగన్ ఓ మంచి డాక్టర్‌కు చూపించుకోవాలని హితవు పలికారు. అబద్ధాల్లో ఆస్కార్ పొందే సైకో జగన్మోహన్ రెడ్డి అని ఆక్షేపించారు. అసెంబ్లీకి వెళ్లి మాట్లాడమని జగన్‌ను ప్రజలు ఎన్నుకుంటే... అసెంబ్లీకి ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. జగన్‌కు పిచ్చి ఏ స్థాయిలో ముదిరిందో అర్థమవుతోందన్నారు. ఐదేళ్లు అసభ్యంగా మాట్లాడిన జగన్ నోట నీతులు విని ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. జగన్‌కు విశ్వసనీయత అనే పదం తెలుగులో రాయటం రాదు, ఇంగ్లీషులో అర్థం తెలీదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దం కిలో 56 మందికి రూ.77 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. జగన్ ఐసీయూలో పెట్టిన ఆరోగ్యశ్రీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊపిరి పోసిందని చెప్పారు. జగన్ 1.0కే ప్రజలు బెంబేలెత్తి 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. జగన్ 2.0 ఎంత దారుణంగా ఉంటుందో అని ప్రజలు ఆయనకు ఎదురు దండాలు పెడుతున్నారని అన్నారు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లతో అయినా జగన్ రెడ్డి యుద్ధం చేయాలని చెప్పారు. పిరికి వాడిలా అసెంబ్లీలో మైకు ఇవ్వడం లేదని జగన్ కుంటి సాకులు చెబుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.

## పోలీసు విచారణకు హాజరైన వర్మ

అమరావతి,వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మ పోలీసు విచారణకు హాజరయ్యారు. ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో వర్మపై కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి రాంగోపాల్ వర్మ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీంతో టీడీపీ మండల కార్యదర్శి రామలింగం వర్మపై ఒంగోలు జిల్లా మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గత ఏడాది నవంబర్ 10న వర్మపై కేసు నమోదైంది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు హాజరుకావాలని ఆర్జీవీకి పలుమార్లు నోటీసులు పంపారు. అయితే, తనపై నమోదైన కేసు కొట్టేయాలని వర్మ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇటీవల ఫిబ్రవరి 4న విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే, ఈనెల 7న విచారణకు హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలని ఆర్జీవీ కోరారు. విచారణకు రావాలని అధికారులు పలుమార్లు నోటీసు ఇచ్చినా పోలీసుల విచారణకు డుమ్మా కొడుతూ వచ్చిన ఆర్జీవీ నేడు పోలీసుల విచారణకు హాజరయ్యారు. న్యాయవాది సమక్షంలో అధికారులు ఆయనను విచారిస్తున్నారు.

## అందుకే జగన్ కి ధైర్యం !


అమరావతి,పార్టీ నుంచి ఎంతమంది వెళ్ళిపోయినా వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా ధైర్యంగా ఉన్నారు. అది చాలా మందికి అతి విశ్వాసంగా కనిపిస్తోంది. కానీ లోతుగా ఆలోచిస్తే జగన్ ధీమా వెనక బలమైన కారణాలు ఉన్నాయి. అంతే కాదు సరైన రీజనింగ్ కూడా ఉంది. అందుకే జగన్ కూటమి నుంచి ఎంతగా సవాళ్ళు వస్తున్నా లైట్ తీసుకుంటున్నారు. మళ్ళీ మేమే అధికారంలోకి వస్తామని చెప్పగలుగుతున్నారు.పార్టీ నుంచి గడచిన ఎనిమిది నెలలుగా ఎంతో మంది వెళ్ళిపోయారు. అందులో బిగ్ షాట్స్ చాలా మంది ఉన్నారు. ఆఖరుకు విజయసాయిరెడ్డి వెళ్ళిపోవడమే బిగ్ ట్విస్ట్ అని అంటున్నారు. అయినా జగన్ పెద్దగా పట్టించుకోవడం లేదు అంటే ఆయన ఆలోచనలే వేరు అని అంటున్నారు. అవి ధీమాతో కూడినవి అని కూడా అంటున్నారు.ఏపీలో రెండు పార్టీల వ్యవస్థ ఎలా ఉందో రెండు రాజకీయ సిద్ధాంతాలు వ్యవస్థ కూడా అలాగే ఉంది. ఒకటి మధ్యేవాద రాజకీయ సిద్ధాంతం. అది బీజేపీ తెలుగుదేశం జనసేన వంటి పార్టీలను ఆకట్టుకుంటుంది. ఉన్నత స్థాయి వర్గాలు, మధ్యతరగతి, పై మధ్య తరగతి వంటివి ఈ రాజకీయ ఫిలాసఫీకి కట్టుబడి ఉంటాయి. దాంతో ఈ వర్గాలు ఎపుడూ ఈ పార్టీల వైపు మొగ్గు చూపిస్తారు.ఇక అట్టడుగు వర్గాలు ఉన్నాయి. అలాగే మైనారిటీ వర్గాలు కూడా ఉన్నాయి. ఈ వర్గాల రాజకీయ ఫిలాసఫీ వేరు. వీరంతా బీజేపీ సెంట్రిక్ పాలిటిక్స్ కి దూరం పాటిస్తారు. అంతే కాదు మధ్యేవాద రాజకీయ సిద్ధాంతానికి వీరు యాంటీగా తమదైన రాజకీయ ఫిలాసఫీని ఇష్టపడతారు.ఈ వర్గాలు మొదట కాంగ్రెస్ ఆ తరువాత వైసీపీకి అండగా ఉన్నాయి. ఆ విధంగా చూస్తే రెండు పార్టీల వ్యవస్థ గా పైకి ఏపీలో కనిపించినా రెండు బలమైన సిద్ధాంతాల మధ్య పోరాటంగా లోతుగా చూస్తే అర్థం అవుతుంది. అలా చూసినపుడు కూటమికి మద్దతుగా ఉన్న ఫిలాసఫీ కానీ వర్గాలు కానీ వైసీపీకి అండగా ఉన్న వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేసినా అవి ఫలించే అవకాశాలు అంతగా ఉండవు.అందుకే వైసీపీకి 40 శాతం ఓటు బ్యాంక్ 2024 ఎన్నికల్లోనూ దక్కింది. అన్ని పార్టీలు కలసి వచ్చినా వైసీపీ బలంగా ఉంది అంటే ఈ సైద్ధాంతిక భూమిక ఆ పార్టీని కాపాడుతోంది అన్న మాట. మరో వైపు చూస్తే కనుక ఈ వర్గాలు కాంగ్రెస్ కనుక ఏపీలో బల పడితే మళ్ళీ అటు వైపు మొగ్గు చూపడం ఖాయం. కానీ ఇపుడున్న పరిస్థితుల్లో ఏపీలో కాంగ్రెస్ బలపడేందుకు ఆస్కారం తక్కువ. దాంతోనే వైసీపీకి ఈ ధీమా వచ్చింది అని అంటున్నారు.సిద్ధాంత పునాది ఉన్న పార్టీలకు ఓటములు పలకరించినా తిరిగి లేచేందుకు ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు టీడీపీ. ఆ పార్టీని అల్లుకుని ఉన్న వారంతా తిరిగి గెలిపించుకుంటారు. వైసీపీకి అదే రకమైన పొలిటికల్ ఫిలాసఫీ ఉంది. దాంతోనే వైసీపీ మళ్ళీ గెలుస్తామని అంటోంది. రాజకీయ పార్టీలతో పాటు ఈ సిద్ధాంతాల మధ్య జరిగే పోరాటంలో ఒకసారి ఒక పార్టీ గెలిస్తే మరోసారి ఇంకో పార్టీ గెలుస్తుంది. ఇది ఆనవాయితీగా ఉంటోంది.ఇక చూస్తే కూటమి వదిలేసిన అలాగే కూటమికి అట్రాక్ట్ కానీ వర్గాలే వైసీపీ బలాలు. అలా ఆలోచిస్తే వైసీపీకి కావాల్సినంతగా పొలిటికల్ స్పేస్ ఏపీలో ఉంది. ఏపీలో ఎన్డీయేతర వర్గాలు అన్నీ కచ్చితంగా జగన్ వెంట ఉంటాయని రాజకీయ విశ్లేషకులూ చెబుతారు. ఎన్డీయేలో ఉన్న పార్టీల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం జగన్ కి ఎపుడూ కలసి వస్తూనే ఉంటుంది.జగన్ తాను నాయకత్వం వహించి పార్టీని దూకుడుగా ముందుకు తీసుకుని పోతే చాలు. ఇక నాయకులు అన్న వారు గాలి మారితే అటు నుంచి ఇటూ వస్తారు. అలాగే కొత్త నీరూ వస్తుంది. అందుకే జగన్ ధీమాగా మేమే గెలుస్తామని అంటున్నారు. కూటమి పార్టీలు వైసీపీ లీడర్స్ ని తీసుకోగలవు కానీ వైసీపీని మోస్తున్న పొలిటికల్ ఫిలాసఫీని ఏమీ చేయలేవని అంటున్నారు. ఏపీ మీద ఎంతో కొంత ద్రవిడ వాద ప్రభావం ఉంది. ఆ ప్రభావంతో ఉన్న వర్గాలే వైసీపీకి ఇపుడు కొండంత అండ. అదే శ్రీరామ రక్ష కూడా అన్నది సిసలైన విశ్లేషణ..

# 'ఉపాధి'కి తీవ్ర నిధుల కొరత



హైదరాబాద్,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తీవ్రమైన నిధుల కొరత వెంటాడుతున్నది. 2024- 25 బడ్జెట్లో కేటాయించిన నిధులను విడుదల చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఒక వైపు గ్రామీణ ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలని డిమాండు ఉన్నప్పటికీ అదనంగా నిధులు కేటాయించకపోగా.. గత బడ్జెట్లో పెట్టిన నిధులను కూడా విడుదల చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి ఎలాంటి అదనపు కేటాయింపులు జరగలేదు. ఫలితంగా కార్మికులకు వేతనాల చెల్లింపులు అసాధారణ జాప్యం జరుగుతున్నది.విశ్వసనీయ సమాచారం ప్రకారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ పథకం కింద వేతనాల కోసం రూ. 4315 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అందుకోసం నిధుల బదిలీ ఆదేశాలు (ఎఫ్‌టిఒ) జారీ చేశారు. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 3(3) ప్రకారం దినసరి వేతనాలను వారానికి ఒకసారి చొప్పున అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైనా పని పూర్తయిన తర్వాత పక్షం రోజులు దాటకూడదు. ఉపాధి పథకానికి మెటీరియల్ రూపంలో కేంద్రం తన వాటాగా రూ. 5715 కోట్ల బకాయి పడింది. ఉపాధి పనులకోసం ఉపయోగించే సామగ్రి కొనుగోలుకు అయ్యే వ్యయంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాల్సి ఉంటుంది. కేంద్రం తన వాటాను విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా భవిష్యత్ ప్రాజెక్టులపై ప్రభావం పడుతుంది.మెటీరియల్ ఖర్చును చెల్లించడంలో జరుగుతున్న నిరంతర జాప్యం ఫలితంగా ముడిసరుకును సరఫరా చేసే స్థానిక సరఫరాదారులు విముకత చూపుతున్నారు. 2024 సంవత్సరం బడ్జెట్లో ఉపాధి పథకానికి ప్రభుత్వం రూ. 86 వేల కోట్లు కేటాయించింది. అదనంగా నిధులు కేటాయించాలని గ్రామీణాభివృద్ధి శాఖ నుండి పలు విజ్ఞాపనలు వచ్చినప్పటికీ ఆర్థిక శాఖ పట్టించుకోలేదు. పథకానికి తక్కువ నిధులు కేటాయించడం పై విమర్శలు చెలరేగడంతో ప్రభుత్వం స్పందిస్తూ ఇది డిమాండ్‌ను బట్టి నడిచే పథకమని అవసరమైనప్పుడు అదనపు కేటాయింపులు జరుపుతామని తెలిపింది. ఉదాహరణకు 2020- 21 ఆర్థిక సంవత్సరంలో.. అంటే కోవిడ్ సమయంలో కార్మికులు పెద్ద సంఖ్యలో నగరాల నుండి స్వస్థలాల బాటపట్టారు.ఆ సమయంలో ప్రభుత్వం పథకానికి కేటాయింపును రూ. 61,500 కోట్ల నుండి రూ.1,11,500 కోట్లకు పెంచింది. ఆ తర్వాత తగ్గిస్తూ వస్తుంది. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటంతో కృత్రిమంగా డిమాండు తగ్గుతుందని పథకాన్ని నిశితంగా పరిశీలిస్తున్న నిపుణులు, హక్కుల కార్యకర్తలు, ప్రజా సంఘాలు పూర్తిస్థాయి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచడం లేదు. వేతనాలు పెంచాలని కోరుతూ విజ్ఞప్తులు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వంలో వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేసిన 7,500 మంది ఫీల్ అసిస్టెంట్‌లను ఉద్యోగాల నుంచి తొలగించింది. తిరిగి రెండున్నర సంవత్సరాల తర్వాత 2023 ఎన్నికల ముందు తిరిగి వారిని పనిలోనికి తీసుకున్నారు. కానీ వేతనాలు పెంచలేదు.రాష్ట్రంలో ఉపాధి హామీ స్కీంలో రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్స్ మొదలగువారు పని చేయుచున్నారు. వీరికి నవంబర్ నెల నుంచి జీతాలు రావడం లేదు. ఈ స్కీమ్‌లో గత 18 సంవత్సరాల నుంచి పని చేస్తున్నప్పటికీ కనీస వేతన విధానం, పే స్కేలు లేదు. వీరిలో చాలామంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నారు. ఈ మధ్యకాలంలో కొంతమంది చనిపోయారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నప్పటికీ మాకు గుర్తింపు లేదని, నెలకు జీతాలు రాక, అప్పులతో ఆత్మహత్యలు కూడా చేసుకున్న వారు ఉన్నారని సిబ్బంది ఆందోళన వెలిబుచ్చుతున్నారు. మొదటిసారిగా 2016 వేతనాలు పెంచినారని ప్రస్తుతం ఫీల్ అసిస్టెంట్స్‌కు రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని.. అది గత మూడు నెలలుగా వేతనాలు అందలేదని తెలుపుతున్నారు.మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఉపాధి హామీ ఉద్యోగులు 606 మండలాల్లోని ఎంపిడిఒలకు వినతి పత్రాలు సమర్పించారు. పెండింగ్ వేతనాలతో పాటు వేతన సవరణ, పే స్కేల్స్ ఇవ్వాలని కోరుతూ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం ఐకాస ప్రకటించింది. ఉపాధి హామీ పనులలో మెటీరియల్ కాంపోనెంటుకు 40 శాతం, లేబర్ కాంపోనెంట్‌కు 60 శాతం కేటాయిస్తూ, మెటీరియల్ కాంపోనెంటులో 5 శాతం ఉద్యోగుల వేతనాలకు కేటాయిస్తున్నారు. 10 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సింది, కేంద్రం నుంచి వచ్చే నిధులు సకాలంలో విడుదల కాకపోవటంతో పనులు పూర్తిగా కాకపోవడం.. అందులో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు సకాలంలో ఇవ్వలేకపోతున్నామని గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రకటిస్తుంది.

# కుల గణన సర్వే లెక్క తేలిందా..?



హైదరాబాద్,తెలంగాణ పల్లెల్లో కుల, మతాలకు అతీతంగా అన్నా- తమ్ముడు, అక్కా- చెల్లె... అంటూ ఆప్యాయంగా పిలుచుకునే సుహృద్భావ వాతావరణం ఉన్నది. ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు తోడుగా ఉండే వాతావరణం ఉంది. పక్క రాష్ట్రాల్లో ఉన్నట్టు కుల దురభిమానం లేదు. అది తెలంగాణ సమాజానికి మంచిది కూడా.. భిన్నత్వంలో ఏకత్వంతో తమ హక్కుల కోసం కొట్లాడే సంస్కృతి తెలంగాణ సమాజానికే సొంతం. అటువంటి ఐక్యత, పోరాట స్ఫూర్తి కలిగిన తెలంగాణ గడ్డ మీద కుల గణన ద్వారా కొంత మంది నాయకులు ఒక వర్గం మీద మరొక వర్గాన్ని రెచ్చగొట్టడం సరికాదు.తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్నాక మొదటిసారి 2014లో ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే జరిగింది. ఈ సర్వేలో దాదాపు మూడు కోట్ల అరవై మూడు లక్షల జనాభా ఉన్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇందులో సామాజిక వర్గాల వారీగా జనాభా శాతం చూస్తే ఓసి -21%, బీసీ -51%, ఎస్సీ -18%, ఎస్టీ -10%. అయితే ఇందులో ముస్లిం, మైనార్టీలు దాదాపు 14% ఉన్నట్టు తెలిపింది. ఇందులో కూడా బీసీ, ఓసీలు ఉంటారు. కానీ ప్రత్యేకంగా ముస్లిం మైనార్టీ బీసీ, ముస్లిం మైనార్టీ ఓసీలని ప్రత్యేకించి చెప్పలేదు.

లక్షల్లో జనాభా తక్కువ నమోదైంది!

ఇక బీసీల్లో బీసీ- ఏ, బీసీ -బి,- బీసీ-డి లు మాత్రమే హిందూ బీసీలు.. బీసీ-సి వర్గంలో ఎస్సీ సామాజిక వర్గంలోని ప్రజలెవరైనా క్రైస్తవ మతంలోకి వెళ్తే వారు బీసీ- సి కింద పరిగణింపబడతారు.. ఇక బీసీ- ఈ లో ముస్లిం, మైనార్టీల్లో సామాజిక, ఆర్థిక వెనకబాటు ఉన్నవారు వస్తారు.. దాదాపుగా బీసీ- ఏలో 68 కులాలు.. బీసీ-బిలో 28 కులాలు, బీసీ - సీలో ఒకటి, బీసీ- డిలో 51 కులాలున్నాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి బీసీలైన బీసీ- ఈ వర్గంలో 14 కులాలు ఉన్నాయి. మొత్తంగా బీసీ సామాజికవర్గంలో 162 కులాలు ఉన్నాయి. ఇప్పుడు పదేళ్ల తర్వాత 2024లో జరిగిన కుల గణన సర్వేలో పాల్గొన్న మొత్తం జనాభా 3.54 కోట్లు అయితే సర్వేకు దూరంగా ఉన్న జనాభా దాదాపు 16 లక్షలని ప్రభుత్వం తెలిపింది. అంటే మొత్తం జనాభా 3.70 కోట్లు.. 2011 జన గణనలో తెలంగాణ జనాభా 3.51 కోట్లు.. 2014 నాటికి సమగ్ర సర్వేలో పెరిగిన జనాభా 3.63 కోట్లు అంటే దాదాపు మూడు ఏండ్లలో 12 లక్షలు పెరిగింది. అంటే ఏడాదికి సగటున 4 లక్షల జనాభా పెరిగింది. ఈ సగటును పరిగణనలోకి తీసుకున్నా 2014 నుండి 2024 వరకు జనాభా దాదాపు 35-40 లక్షలు పెరగాలంటే 4 కోట్లకు పైగా ఉండాలి. కానీ లక్షల్లో జనాభా తక్కువగా నమోదైంది.. అంటే సర్వేలో పాల్గొన్నది 97% కాదు.. అంత కంటే తక్కువే.. దాదాపు 5-6% మంది ప్రజలు సర్వేకు దూరంగా ఉండి ఉంటారు.

ఈ గందరగోళం అందుకే..!

2024లో జరిగిన కుల గణనలో సామాజిక వర్గాల వారీగా జనాభా శాతం ఈ విధంగా ఉంది. సామాజిక వర్గాల వారీగా.. ఓసి - 13.31%, బీసీ - 46.25%, ఎస్సీ - 17.43%, ఎస్టీ - 10.45%, ముస్లిం మైనార్టీ - 12.56% (ఇందులో బీసీ -10.08%, ఓసీ-2.48%) ఉన్నారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాల్ని మినహాయించి ముస్లిం మైనర్టీల్లోని బీసీలను కలిపితే రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 56.33%, అదే విధంగా ముస్లిం మైనర్టీల్లోని ఓసీలను కలిపితే రాష్ట్రంలో మొత్తం ఓసీ జనాభా 15.79%. వీటిని 2014, 2024 కుల గణన సర్వేలో వెల్లడైన వివరాల్ని పోల్చినపుడు ఎస్సీ, ఎస్టీ జనాభా శాతంలో పెద్దగా మార్పు లేదు కానీ, బీసీ, ఓసీ జనాభా శాతంలో మార్పు కనిపిస్తుంది. కారణం 2014 సర్వేలో ముస్లిం మైనార్టీలను బీసీ, ఓసీలలో వారి శాతాన్ని ప్రత్యేకంగా చెప్పకపోవడమే. 2024లో ముస్లిం మైనార్టీలను బీసీ, ఓసీలలో ప్రత్యేకించి చెప్పడం వల్ల ఈ గందరగోళం ఏర్పడింది. వాస్తవానికి 2014లో మొత్తం బీసీ జనాభా 51% ఉంటే 2024 నాటికి 56% శాతానికి పెరిగింది. అంటే దాదాపు 5% పెరిగింది ఇందులో ముస్లిం మైనార్టీ బీసీలు 10% ఉన్నారు. ఇక ఓసీలు 2014 సర్వేలో 21% ఉంటే 2024 నాటికి 15.79% శాతానికి తగ్గారు. అంటే దాదాపు 5.21%. ఇందులో కూడా ముస్లిం, మైనార్టీ ఓసిలున్నారు..

ప్రజల అపోహలు తొలగించాలి!

2014 సర్వేలో బీసీ జనాభా శాతంలో ముస్లిం, మైనార్టీ జనాభా శాతాన్ని లెక్కించకుండా ఓసీ జనాభా శాతం 21% ఉంటే అందులో నుండి 13% ముస్లిం మైనార్టీలను తీసేసి ఓసీ జనాభా పది శాతం లోపు మాత్రమే అని ప్రచారం చేస్తున్నారు. అయితే అది వాస్తవ దూరమని కొంతమంది అభిప్రాయపడుతున్నారు.. ఓసీల్లో ఉన్న ముస్లిం, మైనార్టీల జనాభా శాతాన్ని తీసివేసినప్పుడు, బీసీల్లో ఉన్న ముస్లిం, మైనార్టీల (బీసీ - ఈ) జనాభా శాతాన్ని తీసి వేసినపుడే అసలు ఎంత మంది ఉన్నారో తెలుస్తుంది. 2024 కుల గణన సర్వేలో బీసీ జనాభా ముస్లిం మైనార్టీలను మినహాయించి 46.25% ఓసీ జనాభా 13.31%. వాస్తవానికి బీసీ జనాభా శాతం ఎక్కువగా ఉంటదని కొంతమంది.. లేదు ముస్లిం, మైనార్టీలను మినహాయించి ఓసీ జనాభా ఎక్కువగా ఉంటుం దని కొన్ని కుల సంఘాల వారు వాదిస్తున్నారు.. ప్రభుత్వమే ఈ వివాదానికి తెర దించాలి.. కుల ,మత, ప్రాంత వైషమ్యాలు లేని తెలంగాణ రాష్ట్రంలో కుల గణన కొత్తగా కులాల కుంపట్లు పెట్టినట్టు అవుతుంది. రెండు సర్వేల గురించి వాటి మధ్య ఉన్న వ్యత్యాసాల గురించి ప్రజల్లో ఉన్న అపోహల్ని తొలగించే ప్రయత్నం చేయాలి. ఎవరికీ ఇష్టం వచ్చినట్టు వాళ్లు మాట్లాడుతుంటే ప్రభుత్వం చేసిన ఈ బృహత్తర కార్యక్రమం బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అందుకే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలి. లేదా ఈ వివరాలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి.

ప్రజలను రెచ్చగొట్టొద్దు!

తెలంగాణ సామాజిక చరిత్రను పరిశీలిస్తే తెలంగాణలో చాతుర్వర్ణ వ్యవస్థ లేదు.. అసలు దక్షణాది రాష్ట్రాల్లోనే లేదు. శూద్ర వర్ణాలుగా చెప్పబడిన కొన్ని కులాలే కాలక్రమేణా ఓసీలుగా పేర్కొనబడ్డాయి. దేశంలో ఒక రాష్ట్రంలో బీసీలుగా గుర్తించబడిన కులాలు మరో రాష్ట్రంలో ఓసీలు, ఒక రాష్ట్రంలో ఎస్టీలుగా గుర్తించబడిన వారు మరొక రాష్ట్రంలో బీసీలుగా గుర్తింపబడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న వివిధ కులాల సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని బట్టి కులాలు వివిధ వర్గాల్లో చేర్చబడ్డాయి.. ఇక తెలంగాణ విషయానికి వస్తే నిజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం నుండి మొదలుకొని తర్వాత జరిగిన 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమం, 2009లో జరిగిన మలి దశ ఉద్యమంలో కుల మతాలకు అతీతంగా సకల జనులు జరిపిన పోరాటం భారతదేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. అటువంటి ఐక్యత, పోరాట స్ఫూర్తి కలిగిన తెలంగాణ గడ్డ మీద కుల గణన ద్వారా కొంత మంది నాయకులు ఒక వర్గం మీద మరొక వర్గాన్ని రెచ్చగొట్టడం సరికాదు. ప్రజాస్వామిక పద్ధతుల్లో పోరాడి హక్కులు సాధించుకోవాలి.

## డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు అవకాశాలు

హైదరాబాద్,తెలంగాణలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు పలు సంస్థలు ముందు కొచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 500 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సెంటిలియాన్, హెచ్‌పీ రోబోటిక్స్ సంస్థల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి నమ్మకం కలిగించే విధంగా పారిశ్రామిక విధానాలు రూపొందిస్తు న్నామన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ పరిశ్రమలు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రభాకర్‌ను ఏడురోజుల కస్టడీకి పిటిషన్

హైదరాబాద్, ప్రిజం పబ్ కాల్పుల కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తుండటంతో ప్రభాకర్‌ను ఏడు రోజుల పాటు కస్టడీకి కోరుతూ పిటిషన్ వేశారు పోలీసులు. అయితే ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరుగనుంది. అలాగే ప్రిజం పబ్ కేసులో సాఫ్ట్‌వేర్ రంజిత్ అరెస్ట్ అయ్యారు. ప్రభాకర్‌కు రంజిత్ బస్సులో పరిచయం అయ్యాడు. ప్రభాకర్‌కు రంజిత్ బ్యాంక్ అకౌంట్‌లు సమకూర్చి హెల్ప్ చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు కలిసి బీహార్‌కు వెళ్లి గన్స్ కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ప్రభాకర్ అరెస్ట్‌తో పారిపోయిన రంజిత్‌ను ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బత్తుల ప్రభాకర్ చంచల్ గూడ జైలులో ఉన్నాడు. ప్రభాకర్‌ను విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. అతడు చేసిన నేరాలు, నేరచరిత్రను తెలుసుకోవాలనుకున్నారు. 2013 నుంచి నేరాలు చేయడం షురూ చేశాడు బత్తుల ప్రభాకర్. అప్పటి నుంచి వందల చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారుగా 80 నుంచి వంద వరకు బత్తుల ప్రభాకర్‌పై కేసులు ఉన్నాయి. ప్రధానంగా విద్యాలయాలనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డాడు. సుమారు 23 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు ప్రభాకర్. నేరాలు చేసిన సమయంలో పట్టుబడితే తప్పించుకునేందుకు వీలుగా తుపాకులు కొనుగోలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ గన్స్‌ను బీహార్ నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అయితే అతడు గన్స్ ఎప్పుడు కొనుగోలు చేశాడు.. గన్స్ కొనుగోలులో సహకరించిన వారు ఎవరు అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేయనున్నారు. అందుకు అనుగుణంగా బత్తులను కస్టడీకి కోరుతున్నారు పోలీసులు. మరోవైపు కొల్లగొట్టిన సొమ్మునంతా ఎక్కడ దాచాడు.. ఎవరెవరికి ఇచ్చాడనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేయనున్నారు. ఇక అతడికి ఎవరైనా సహకరించారా అనే అంశాలపై కూడా విచారణ జరిపిన పోలీసులకు రంజిత్ పేరు బయటకు వచ్చింది. బత్తుల ప్రభాకర్‌కు రంజిత్ సహకరించినట్లు గుర్తించిన పోలీసులు.. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. రంజిత్ సహకారంతో గన్స్ కొనుగోలు చేసిన నేపథ్యంలో వీరిద్దరికీ ఎవరు సహకరించారు అనే అంశాలపై విచారించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

## వారి పరిస్థితి ఏంటి?

వాషింగ్టన్,అమెరికా నుంచి మొదటి విడతలో 104 మంది ఇండియాకు తిరిగి వచ్చారు. బహిష్కరణకు గురైయ్యారు. తిరిగి దేశానికి వచ్చేశారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏంటి? వాళ్ళు మళ్ళీ అమెరికా వెళ్ళగలరా? వాళ్ళని మోసం చేసిన ఏజెంట్లకు శిక్ష పడుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏజెంట్ల చేతిలో మోసపోయి..లక్షలు పోగొట్టుకుని...అటు కలలు కన్న అమెరికాలో ఉండలేక..బహిష్కరణకు గురై అంతకు మించి అవమానం పాలై మొత్తం 104 మంది ఇండియాకు తిరిగివచ్చారు. తిరిగి వచ్చారు అని చెప్పడం కంటే ఖైదీల్లా కట్టేసి తీసుకువచ్చారు అని చెప్పడం కరెక్ట్ ఏమో. ఇలా వచ్చిన ప్రతీ ఒక్కరిదీ ఒకో కన్నీటి గాథ. మంచి జీవితం కోసం తాపత్రయం పడితే అదీ దక్కలేదు... ఇండియాలో కూడా మామూలుగా జీవితం జీవించే పరిస్థితి లేదు. ఇప్పుడు తాము ఎలా ఉండాలనేది వారందరి ప్రశ్న. వీళ్ళందరూ డాంకీ రూట్ ద్వారా అమెరికాలో ప్రవేశించడానికి ప్రయత్నించిన వాళ్ళే. మెక్సికో బోర్డర్ లో పట్టుబడి, అక్కడ కొన్నాళ్ళు బందీలుగా ఉండి..ఇప్పుడు భారత్ కు తిరిగి వచ్చారు. ఇప్పుడు వీరి భవితవ్యం ఏంటి అని అందరూ అడుగుతున్న ప్రశ్న.

సాధారణ భారతీయుడిలా బ్రతకాలి...

అమెరికా వెళ్ళాలని, బాగా బతకాలని ఎన్నో కలలు కన్నారు. అవన్నీ కల్లలు అయ్యాయి. దానికి తోడు డబ్బులు కూడా పోయాయి. దీంతో అమెరికా నుంచి వారందరూ కన్నీటి పర్యంతం అవుతున్నారు. అయితే ఇలా వచ్చిన వారిపై ఎటువంటి చట్టపరమైన చర్యలు ఉండవు అని చెబుతున్నారు. నిజమైన పాస్ పోర్ట్ ఉండి, చెల్లుబాటు అయ్యే పత్రాను ఉపయోగించినట్లైతే వారిని ఎవరూ ఏ చేయరు అని చెబుతున్నారు ఢిల్లీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కెకె. మనన్. నకిలీ పాస్ పోర్ట్ లు, లేదా ఫోటోలు ఉపయోగించిన వారు...మోసపూరితంగా అమెరికా వెళ్ళడానికి ప్రయత్నించిన వారి మీద మాత్రం చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పుడు వచ్చిన వారిలో చాలా మంది తక్కువ చదువుకున్న వారు, పేద కుటుంబాలు వాళ్ళు ఉన్నారు. కాబట్టి ఈ వ్యక్తులు నకిలీ పత్రాలను తయారు చేయడంలో పాల్గొనే అవకాశం చాలా తక్కువ అని చెబుతున్నారు. వీళ్ళు ఇక్కడ అంతా ప్రోసీజర్ అయిపోయాక వాళ్ళ ఊళ్ళు లేదా గ్రామాలు వెళ్ళి ఎప్పటిలానే బతకొచ్చని చెబుతున్నారు.

మళ్ళీ అమెరికా వెళ్ళే ఛాన్స్...

ఇప్పుడు బహిష్కరణకు గురైన వాళ్ళు మళ్ళీ అమెరికా వెళ్ళే ఛాన్స్ ఉంటుందా..అంటే కష్టమేనని చెబుతున్నారు. ఎందుకంటే మళ్ళీ వెళ్ళాలంటే తప్పనిసరిగా వీసా ఫారమ్ నింపాల్సి ఉంటుంది. అందులో ఎప్పుడైనా బహిష్కరణకు గురైయ్యారా అనే ప్రశ్న ఉంటుంది. దాని కచ్చితంగా నింపాల్సి కూడా ఉంటుంది. అందులో గురయ్యామని చెబితే మళ్ళీ వీసా ఇవ్వరు. ఒక్క అమెరికానే కాదు దీనివలన చాలా దేశాలు వీసాలు నిరాకరిస్తాయి. అంతేకాదు ఇప్పుడు బహిష్కరణకు గురైన వాళ్ళు 5 నుంచి 10 ఏళ్ళ వరకూ అసలు వీసా దరఖాస్తు చేసుకోవడానికే ఒప్పుకోరు అని చెబుతున్నారు.

ఏజెంట్లపై చర్యలు తీసుకుంటారా..

లక్షల రూపాయలు తీసుకుని అమాయకులను మోసం చేసిన ఏజెంట్ల పరిస్థితి ఏంటని ప్రశ్నలు వచ్చినప్పుడు..వారిపై చ్చింగా చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు కే.కే. మనన్. ట్రావెల్ ఏజెన్సీలను పట్టుకుని...ఏజెంట్లపై చర్యలు తీసుకునే విధంగా దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ వ్యక్తులను చట్టవిరుద్ధంగా అక్కడికి పంపడంలో ప్రధాన పాత్ర పోషించిన వారే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాలని చెప్పారు. బహిష్కరణకు గురైన వారిని విదేశాలకు ఎవరు పంపారు మరియు వారిని ఎలా పంపించారు అనే దానిపై సమగ్ర దర్యాప్తు జరగాలని అన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటు కూడా లేవనెత్తాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. సైబర్ డొమైన్‌లో హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (%వీనూ%), రాష్ట్ర పోలీసు అధికారుల సహకారంతో అక్రమ నియామక ఏజెంట్లపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

హైదరాబాద్, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో నమోదయ్యాయని అన్నారు.వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు.అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప కూడా దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనమని అన్నారు. ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన

# వరుసగా రెండురోజులు స్కూళ్లకు సెలవులు



హైదరాబాద్, వరుసగా రెండు రోజుల పాటు స్కూళ్లకు సెలవులు రానున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు జనవరిలో భారీగా సెలవులు వచ్చాయి. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సెలవులు దొరకడంతో విద్యార్థులు సందడిగా గడిపారు. అయితే వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండటంతో ప్రిపరేషన్‌తో బిజీ అయిపోయారు స్టూడెంట్స్. అయితే ఫిబ్రవరిలో మరో రెండు రోజుల పాటు సెలవులు రానున్నాయి. ఇప్పటికే నాలుగు ఆదివారాలు రాగా మరో రెండు రోజులు కూడా సెలవు దొరకనున్నాయి. 4 ఆదివారాలతో పాటు శివరాత్రి పండుగ కూడా ఈ నెలలోనే వచ్చింది. వీటికి తోడు అదనంగా మరో రోజు కూడా సెలవు దొరకనుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఆయా స్థానాలకు నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. ఇందుకుగానూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్‌తో పాటు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ దృష్ట్యా పాఠశాలలకు సెలవు ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్, స్కూల్ టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు ప్రభుత్వాలు సెలవు ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఈ నెల 27న కూడా సెలవు మంజూరు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న శివరాత్రి పండుగ రావడంతో ఆ రోజు పబ్లిక్ హాలీడే ఇస్తారు. దీంతో ఈ నెలలో ఆదివారాలతో పాటు మరో రెండు రోజుల సెలవులు కలిపి మొత్తం ఆరో రోజుల పాటు విద్యార్థులకు సెలవులు వచ్చినట్లు అవుతుంది. తెలంగాణతో పాటు ఏపీలో శివరాత్రి పర్వదినం తర్వాత రెండు రాష్ట్రాల్లో ఒకేరోజు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ స్థానాలకు ఎన్నిక జరగనుంది. అలాగే విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం స్థానాల్లోనూ ఎలక్షన్స్ నిర్వహిస్తారు.

# ఉపాధ్యాయులు ఫుల్.. విద్యార్థులు నిల్..!



నర్సింహులపేట, విద్యార్థుల సంఖ్యను పెంచి.. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతాన్ని మాత్రం పెంచలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మూత"బడే"పరిస్థితి నెలకొంది. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభించి బడిబాట కార్యక్రమం నిర్వహించినా..అరకొర విద్యార్థులే చేరారు. ఇప్పుడా ఆ విద్యార్థుల శాతం కూడా తగ్గిపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. విద్యార్థులతో నిండాల్సిన ప్రభుత్వ బడులు ఉపాధ్యాయులతో నిండుతున్నాయి.. పట్టుమని పదిమంది విద్యార్థులు లేని బడుల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఈ విధంగా విద్యా వ్యవస్థ కొనసాగితే ప్రభుత్వ బడులను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలు విద్యార్థి సంఘాలు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**ప్రభుత్వం సౌకర్యాలు అందిస్తున్నా.. హాజరు శాతం పెరగడం లేదు..**

ప్రభుత్వం అందించే ఉచిత దుస్తులు.. మధ్యాహ్న భోజనం అన్నిరకాల సౌకర్యాలు కల్పించినా.. విద్యార్థుల శాతం పెంచకపోవడంతో రాబోయే రోజుల్లో సర్కార్ కొలువు కోసం ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నర్సింహులపేట మండలంలోని పాఠశాలలు..**

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో 34ప్రాథమిక పాఠశాలలు, 10ప్రాథమికోన్నత పాఠశాలలు, 2 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.. వీటిలో ఆంధ్రప్రభ పరిశీలన చేయగా..

**కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..**

అమీర్యతండాలో ఒకే విద్యార్థి ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. ఇదే పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయుడు ఉంటే అందులో హెచ్‌ఎం లీవ్ లోనే ఉన్నారు. వస్త్రం తండాలో ముగ్గురు విద్యార్థులకు.. ఇద్దరు ఉపాధ్యాయులు. ఇదిలా ఉండగా ఒకరు సెలవులో ఉన్నారు. లోక్యతండాలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఇలా సగం పాఠశాలల్లో నలుగురు, ముగ్గురు ఉపాధ్యాయులు.. నలుగురు, ముగ్గురు విద్యార్థులతో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు..

**సుమారు 30మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. సుమారు 30మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల హాజరు శాతం లేకపోవడంతో ముగ్గురు ఉపాధ్యాయులకు ముగ్గురు విద్యార్థులు ఉంటున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, పలు ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

# వ్యవసాయరంగం బలోపేతంతోనే ఆర్థికాభివృద్ది



న్యూఢిల్లీ, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయలేనంత కాలం దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశంలో సమజవనరులు ఉన్నా, ఇంకా దిగుబడులపై ఆధారపడుతున్నాం. వంటనూనెలు, పప్పుల దిగుమతులపై పునరాలోచన చేయాలి. సొంతంగా ఆహారధాన్యాలను ఉత్పతత్ఇ చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలి. కార్పోరేట్లకు ఇస్తున్న రాయితీలను రైతులకు కూడా వర్తింపచేసి పంటలను పండించుకునే దిశగా అడుగులు వేయాలి. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహించాలి. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. నదుల అనుసంధానం జరగడం లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు.

పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. 2018-19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయరంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. అన్నింటికి మించి ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధించాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించడం లేదు. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు.

# ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం



న్యూఢిల్లీ,ఈ సంవత్సరం చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30న అక్షయ తృతీయ పండుగ నాడు ప్రారంభమవుతుంది. గంగోత్రి, యమునోత్రి ధామ్ తలుపులు తెరవడంతో యాత్ర ప్రారంభం అవుతుంది. బద్రీనాథ్ ఆలయ తలుపులు మే 4న తెరుచుకుంటాయి. కేదార్‌నాథ్ ధామ్ తెరిచే తేదీని మహాశివరాత్రి పండుగనాడు నిర్ణయిస్తారు. ఈ మేరకు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన యాత్ర నిర్వహణ కమిటీ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏప్రిల్‌లో ఉత్తరాఖండ్‌లో ప్రారంభమయ్యే చార్‌ధామ్ యాత్ర సందర్భంగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు, ఇంటర్నెట్‌ను ఉపయోగించలేని యాత్రికులు ఎటువంటి సమస్యను ఎదుర్కోకుండా ఉండటానికి ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా చేయబడుతుంది. చార్‌ధామ్ యాత్ర మార్గాల్లోని అన్ని పనులు ఏప్రిల్ 15 నాటికి పూర్తయ్యేలా చూడాలని పాండే ప్రజా పనుల శాఖను ఆదేశించారు. ఈసారి యాత్ర మార్గంలో ప్రతి పది కిలోమీటర్లకు చీతా పోలీస్ లేదా హిల్ పెట్రోలింగ్ యూనిట్ బృందాన్ని మోహరించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గర్వాల్ డివిజన్ రాజీవ్ స్వరూప్ కూడా సమావేశానికి హాజరయ్యారు. చార్‌ధామ్ యాత్ర కోసం దాదాపు రెండు వేల బస్సులను సిద్ధం చేశారు. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు యాత్ర ట్రస్ట్ గొప్ప శుభవార్త ప్రకటించింది. చార్‌ధామ్ యాత్రకు సంబంధించి యాత్ర ట్రాన్సిట్ క్యాంప్ ప్రాంగణంలో గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాత్ర పరిపాలన గత తప్పుల నుండి నేర్చుకుని, ఈసారి ప్రయాణీకుల నమోదు విధానాన్ని మార్చాలని నిర్ణయించిందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఈ ఇబ్బంది నుండి ఉపశమనం పొందేలా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు 40 శాతం ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు కూడా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇబ్బంది పడకుండా ఉండటానికి 40 శాతం రిజిస్ట్రేషన్లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని పాండే చెప్పారు. గతసారి, ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ ఎంపిక అందుబాటులో లేకపోవడం వల్ల యాత్రికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. హిమాలయ దేవాలయాలకు సాంప్రదాయ ప్రయాణ క్రమాన్ని రిజిస్ట్రేషన్ తర్వాత యాత్రికులకు ఇచ్చిన స్లాట్‌లలో జాగ్రత్తగా చూసుకోవాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# సాయిరెడ్డి ముందర కాళ్ళకు జగన్ బంధం ?



అమరావతి,వైసీపీలో ఎంపీగా జాతీయ స్థాయిలో అత్యంత కీలకంగా వ్యవహరించిన నాయకుడు వి విజయసాయిరెడ్డి. ఆయన జగన్ కి తలలో నాలుకగా ఉండేవారు. పార్టీలో జగన్ తర్వాత ప్లేస్ ఆయనదే అన్నట్లుగా ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చేంతవరకూ ఈ బంధం కొనసాగింది. అయితే ఢిల్లీ స్థాయిలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి ఉంటూ కేంద్ర పెద్దల వద్ద మంచి పలుకుబడి సంపాదించారు. ఆయన ప్రీ అపాయింట్మెంట్ లేకుండానే కేంద్ర పెద్దలను కలిసేటంత సాన్నిహిత్యాన్ని అందుకున్నారని ప్రచారంలో ఉంది. అంతే కాదు ఆయనను చూసి ఆగి మరీ పేరు పెట్టి ప్రధాని నరేంద్ర మోడీ ఒక సందర్భంలో పలకరించారు అంటే విజయసాయిరెడ్డి హవా ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలుసు అని అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డికి వైసీపీ అధినాయకత్వం మధ్య కొంత గ్యాప్ అయితే ఏర్పడింది అన్నది 2022 తరువాతనే పార్టీ వర్గాలకు తెలిసింది అని అంటారు. ఆయనను ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ పదవి నుంచి తప్పించడంతో మనస్తాపం చెందారని అంటారు అంతే కాదు ఆయనకు పార్టీలో ఉన్న ప్రాధాన్యత కూడా ఆ తరువాత మెల్లగా తగ్గించారు అని ప్రచారంలో ఉన్న మాట. ఇవన్నీ ఇలా ఉంటే 2024 తరువాత వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డిని తప్పించి వైవీ సుబ్బారెడ్డికి బాధ్యతలు జగన్ కట్టబెట్టడంతో విజయసాయిరెడ్డి కేవలం రాజ్యసభ నాయకుడిగా మాత్రమే పరిమితం అయ్యారు. ఇలా చాలా అంతర్గతంగా జరిగినవి ఉన్నాయని ప్రచారంలో ఉంది. మరో వైపు బీజేపీ పెద్దలతో విజయసాయిరెడ్డి సాన్నిహిత్యం మాత్రం అలాగే కొనసాగుతూ వచ్చింది అంటారు. ఈ క్రమంలో విజయసాయిరెడ్డి మరో మూడున్నర ఏళ్ళ వ్యవధి ఉండగాన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం వైసీపీకి షాక్ గా మారింది. అంతే కాదు రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లుగా ఆయన ప్రకటించారు. అయితే పార్టీని వీడిపోతూ విజయసాయిరెడ్డి జగన్ ని ఏమీ అనలేదు, పైగా ఆయన మళ్ళీ అధికారంలోకి రావాలని కోరుకున్నారు. మరి జగన్ కూడా విజయసాయిరెడ్డి పట్ల సాఫ్ట్ కార్నర్ తో ఉంటారనే అంతా అనుకున్నారు. కానీ మీడియా సమావేశంలో మాత్రం జగన్ విజయసాయిరెడ్డి విషయం రాగానే కాస్తా హార్ష్ గానే మాట్లాడారు, క్యారెక్టర్ విలువలు అంటూ ఆయన విజయసాయిరెడ్డిని ఇండైరెక్ట్ గా టార్గెట్ చేశారు. అంతే కాదు ప్రలోభాలకు లొంగి వెళ్ళిపోతున్నారు అన్నారు. దానిని విజయసాయిరెడ్డి కూడా ఘాటుగానే రియాక్ట్ అయ్యారు. తనకు క్యారెక్టర్ ఉందని ప్రలోభాలకు లొంగలేదు కాబట్టే తాను పదవులు వదులుకున్నాను, రాజకీయాలూ వదులుకున్నానని చెప్పారు. విజయసాయిరెడ్డి తన వరకూ చెప్పినది కరెక్ట్ గా ఉన్నా ఈ సమయంలో ఆయన రాజీనామా చేయడం అన్నది కూటమికే హెల్ప్ గా ఉందని చెబుతున్నారు. ఆయన రాజీనామా చేసిన తరువాత ఆ పదవి కూటమికే పోతుంది. పైగా మూడున్నరేళ్ళ పాటు ఉన్న పదవి. అందుకే జగన్ ప్రలోభాలు అన్న మాట వాడారా అని చర్చ వస్తోంది. విజయసాయిరెడ్డి రాజకీయ వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయాల నుంచి తప్పుకున్నాను అని ప్రకటన చేసినా ఫ్యూచర్ లో మళ్ళీ రాజకీయాల్లోకి రారు అని ఎవరూ చెప్పలేరని అంటున్నారుఅంతే కాదు ఆయనకు బీజేపీ పెద్దలతో ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల కొన్నాళ్ళ తరువాత అయినా గవర్నర్ లాంటి పదవులు ఇస్తారని పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరిగింది. రాజ్యసభలో బీజేపీకి ఎంపీలు అవసరం, విజయసాయిరెడ్డి రాజీనామాతో ఆ లోటు బీజేపీకి తీరుతోందని అంటున్నారు. అందుకేనా జగన్ ఆయన మీద ఈ తరహా కామెంట్స్ చేశారా అన్న చర్చ కూడా వస్తోంది. ఇవన్నీ ఇలా ఉంటే విజయసాయిరెడ్డి జగన్ కామెంట్స్ మీద స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తాను ప్రలోభాలకు లొంగలేదని. మరి రేపటి రోజున ఆయన ఏ పదవీ స్వీకరించకుండా జీవితాంతం వ్యవసాయమే చేయదలచుకుంటే మాత్రం జగన్ చేసిన కామెంట్స్ తప్పుగానే చూడాలి. అలా కాకపోతే మాత్రం జగన్ విజయసాయిరెడ్డి మీద ఏదో ఒక అంచనాతో చేసినట్లుగా వాటిని భావించాలి. ఏది ఏమైనా విజయసాయిరెడ్డి భవిష్యత్తు ఆలోచనలు కనుక ఉంటే వాటి ముందర కాళ్ళకు జగన్ తన కామెంట్స్ ద్వారా బంధం వేశారా అన్న చర్చ సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## టిటిడి బోర్డు రద్దు చేయాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ,తితిదే బోర్డును రద్దు చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టుకొట్టివేసింది. తితిదే బోర్డు, తిరుపతి తొక్కిసలాట ఘటనపై రామచంద్ర యాదవ్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో విచారణ జరగాలని, తొక్కిసలాట ఘటనలో పరిహారం పెంచాలని అందులో పేర్కొన్నారు. ఈ క్రమంలో సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం

# వైసిపిలో నివురుగప్పిన అసమ్మతి నిప్పు

అమరావతి, వైసిసి నుంచి విజయసాయి నిష్క్రమణ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. రాజకీయాల్లో నిబద్ధత ఉండాలంటూ జగన్ వ్యాఖ్యలు చేశారు. మరో 30 ఏల్లు ఇక తమదే అధికారం అని నమ్మిస్తున్నారు. జగన్‌ను ప్రజలు నమ్ముతున్నారనడానికి మరో నాలుగేళ్లు పడుతుంది. అప్పటికి పరిస్థితితులు ఎలా ఉంటాయన్నది చూడాలి. ఈ లోగా అవినీతి కేసులు వెంటాడుతాయి. కాకినాడ పోర్టు విషయంలో జరిగిన అక్రమాల కేసులో విజయసాయిరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేసుల వల నుంచి తప్పించుకోవడానికే రాజీనామా చేసినట్లుగా క్షేత్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, కష్టకాలంలో విడిచిపోతున్నారని, 'పదవులూ ఆస్తులూ మీకూ, కేసులు మాకా?' అని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అయినా సరే, విజయసాయి రెడ్డి విషయంలో నాయకులనుంచి కార్యకర్తలవరకూ ఎవరూ సానుభూతి ప్రకటించడం లేదు. వైసిపిలో విజయసాయికన్నా ముందే రాజ్యసభ సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఆళ్ల నానీల తర్వాత ఇప్పుడు విజయసాయి రెడ్డి కూడా రాజీనామా చేశారు. ముందు ముగ్గురు రాజీనామాల్లో అంత ప్రత్యేకత ఏమీ లేకపోయినా స్వయం ప్రకటిత జగన్ ఆత్మఅయిన విజయసాయిరెడ్డి రాజీనామా ప్రత్యేకమైనది. జగన్‌కి మంచి జరగాలని కోరుకుంటున్నట్టు ట్వీట్ చేసిన ఆయన, జగన్ కష్టకాలంలో ఉన్నప్పుడు, అది కూడా జగన్ లండన్‌లో ఉన్న సమయంలో హ్యాండ్ ఇచ్చారు. ఇలా ముఖ్యనాయకులు బయటకు వెళ్లిపోవడం వల్ల వైఎస్ఆర్‌సిపి బలహీనపడుతుందా? ఎవరూ రాజీనామా చేసినా? పోతే పోనీ అన్నట్లుగానే వ్యవహారం ఉంది. వైఎస్ఆర్‌సిపి ఏర్పడి దాదాపు 12 ఏళ్లు కావొస్తున్నా.. ఆ పార్టీకి ఓటర్లు ఉన్నారు కానీ, సంస్థాగత నిర్మాణం సరిగా లేదు. 2024 ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత కూడా అధినేత ఏకపక్ష నిర్ణయాలను మానుకోవడం లేదు. నాయకులు రాజీనామా చేసినప్పుడు సయోధ్య చేసే ప్రయత్నాలు కూడా చేయకపోవడం దీనికి నిదర్శనం. వైఎస్ షర్మిల మొదలుకొని, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, విజయసాయి రెడ్డి లాంటి జగన్ ఆప్తులు బయటకెళ్లడం వల్ల వైఎస్ఆర్‌సిపి పనైపోయిందనుకోవడం అపోహ మాత్రమే. ఆప్తులు బయటకు వెళ్లడం వల్ల జగన్ నైతిక స్థైర్యం దెబ్బతింటుందేమోగానీ, పార్టీ దెబ్బతినే అవకాశం లేదు. ప్రాంతీయ పార్టీలు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న నాయకులే ముసలం సృష్టించే ప్రయత్నం చేస్తారు. 2019లో టిడిపి ఓడగానే ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు సిఎం రమేశ్, సుజనా చౌదరి, టిజి వెంకటేశ్, గరికపాటి మోహన్ రావు రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. వీరు కూడా చంద్రబాబు నాయుడికి అత్యంత సన్నిహితులుగా పేరుపొందినవారే. వీళ్లు పార్టీనుంచి వేరుపడటంవల్ల టిడిపికి కలిగిన నష్టం సున్నా. అ అటు టిడిపి, ఇటు వైఎస్ఆర్‌సిపి కేసుల్లో చిక్కుకోవడంవల్ల బిజెపి ప్రాంతీయ పార్టీల భుజం మీద తుపాకీపెట్టి కాలుస్తోంది. 2019 నుంచి 2024 మధ్య వైసిపి భుజం మీద తుపాకీ పెట్టి టిడిపిని కూల్చాలని ప్రయత్నించిన బిజెపి, ఇప్పుడు టిడిపి భుజం మీద తుపాకీ పెట్టి వైఎస్ఆర్‌సిపిని



కూల్చే ప్రయత్నం చేస్తోందని చర్చించుకుంటున్నారు. కానీ, బిజెపి, టిడిపి కలిసి వైఎస్ఆర్‌సిపిని అంతం చేయడం కల్లగానే భావించాలి. మాయల ఫకీర్ ప్రాణం పక్షిలో ఉన్నట్టు? వైఎస్ఆర్‌సిపి భవిష్యత్తు కాంగ్రెస్ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం వైఎస్ఆర్‌సిపి ఓటర్లంతా కాంగ్రెస్ ఓటర్లే. కాంగ్రెస్ పార్టీకి గతంలో బలంగా మద్దతిచ్చిన ఎస్‌సి మాల, ముస్లింలు, రెడ్లు, కాపులు, క్రిస్టియన్లు, బ్రాహ్మణులే? ఇప్పుడు వైఎస్ఆర్‌సిపి ప్రధాన ఓటర్లుగా ఉన్నారు. వీళ్లు ఎప్పుడూ టిడిపికి, దానితో కూటమికట్టే పార్టీలకు వ్యతిరేకంగానే ఉంటారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి అకాల మరణం, తెలంగాణ ఉద్యమం కలిసి ఆంధ్రాలో కాంగ్రెస్‌ని పాతాళంలోకి తొక్కాయి. 2014 నాటికి నోటాతో పోటీపడే స్థాయికి పరిస్థితి దిగజారింది. 2014లో నందిగామ ఎన్నికలో వైఎస్ఆర్‌సిపికి 46.9 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్‌కి 1.3 శాతం ఓట్లు వచ్చాయి. అక్కడి నుంచి గెలిచిన టిడిపి అభ్యర్థి తంగిరాల ప్రభాకర్ రావు మరణించడంతో వెంటనే ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఉప ఎన్నికలో వైఎస్ఆర్‌సిపి పోటీనుంచి తప్పుకోవడంతో వైఎస్ఆర్‌సిపి ఓట్లు బదిలీ అయ్యి 19.5? ఓట్లతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. 2015లో తిరుపతిలో జరిగిన ఉప ఎన్నికలో కూడా వైఎస్ఆర్‌సిపి పోటీనుంచి తప్పుకోవడంతో ఆ ఓట్లన్నీ కాంగ్రెస్‌కి బదిలీ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పెరిగినప్పుడు మాత్రమే జగన్ ఆందోళన చెందాలి గానీ, విజయసాయిరెడ్డి లాంటి నాయకులు వెళ్లిపోయినప్పుడు కాదు. ఆర్థిక వనరులు సమకూర్చేవారు, లాబీయింగ్ చేసేవారు ఏ పార్టీకయినా అవసరమే. కానీ వాళ్లను తెర వెనుకకే పరిమితం చేయాలి తప్ప బడా లీడర్లుగా ప్రమోట్ చేయొద్దు. అధ్యక్షుడు అందర్నీ సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటున్నారు అనే భావన కలిగించడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతుంది. ఏనాడు ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవని సాయి రెడ్డి వల్ల ఒక్క ఓటు కూడా రాదు. ఆయన ఒక అవినీతిపరుడు అనేది మిడిల్ క్లాస్ ప్రజల్లో ఒక అభిప్రాయంగా ఉంది. ప్రజల్లో సానుకూల ఇమేజ్ తెచ్చుకోవాలని సాయిరెడ్డి ఏనాడూ ప్రయత్నించలేదు. సాయిరెడ్డితో పాటు కొడలి నాని, అంబటి రాంబాబు, రోజా, జోగి రమేశ్ వంటి నాయకుల దిగజారుడు భాషతో పార్టీకి నష్టం జరిగింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com